www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 14 ఆగస్టు 2024

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలి

మందులు పంపిణీ చేస్తున్న ఎడిఎ రామకృష్ణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తం గా ఉండాలి అని పశు వైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఒ.రామకృష్ణ అన్నారు. వెల్లలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరంలో ఆయన మాట్లా డారు. పాడి రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాడి పశువులను పరీక్షించారు. ఉచితంగా లివర్ టానిక్కులు, మినరల్ మిక్సర్ పాకెట్లు అంద జేశారు. స్థానిక పెద్రాజు పంతులు పశుసంవర్ధక శాఖ పాలిటెక్నిక్ కళాశాల, ఎన్ఎస్ఎస్ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వెల్ల పశువైద్యులు రామచంద్రరావు, త్రినాథ్‌రావు, రైతులు వైట్ల రాజబాబు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

సేవలు బారెడు... వేతనం మూరెడు

- పని ఒత్తిడిలో అంగన్‌వాడీ మినీ వర్కర్లు
- నేటికీ అరకొర వేతనాలే దిక్కు..
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- పూర్తి స్థాయి అంగన్‌వాడీ వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

అరకొర వేతనంతో బానిసత్వం మాదిరిగా పని చేస్తున్నాం. కేంద్రాలలో అన్ని వంటలు చేస్తూ, పిల్లలకు విద్య కూడా నేర్పిస్తున్నా కేవలం ఆయా జీతం మాత్రమే ఇస్తున్నారని పలువురు మినీ అంగన్‌వాడీ వర్కర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు పెంచి, సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరుతున్నారు.

బాల బాలికలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను ప్రవేశ పెట్టింది. ఉమ్మడి జిల్లాలో 28 ప్రాజెక్టుల పరిధిలో 5 వేల 546 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లోనూ దాదాపు 3.50లక్షల మంది పిల్లలు ఉన్నారు. వీటి పరిధిలో 5001 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 4818 ఆయాలు పని చేస్తుండగా సుమారు 500 వరకూ మినీ కేంద్రాలున్నాయి. అంగన్‌వాడీ టీచర్‌కు నెలకు రూ.11,500 హెల్పర్‌కు, మినీ వర్కర్‌కు రూ.7 వేలు చొప్పున వేతనంగా ఇస్తున్నారు.

అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి 6 సంవత్సరాల వయసు వరకు ప్రతి నెల వారి బరువుని, ఎత్తుని కొలిచి ఆన్‌లైన్లో, రికార్డుల్లో నమోదు చేయాలి. ఒక్కో సెంటర్ పరిధిలో సుమారు 100 మంది పిల్లలు ఉంటున్నారు. కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రీస్కూల్ కార్యక్రమాలు, ఇతర అంశాలు ఎప్పటికప్పుడు ప్రతిరోజు సుమారు 20 వరకు ఫోటోలు తీసి ఐసిడిఎస్ అధికారులకు చేరవేయాలి. ఇవే కాకుండా కేంద్రం పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతల ఆరోగ్య సమాచారం తెలుసుకుంటూ ప్రతిరోజూ వారికి పౌష్టికాహారం అందించాల్సి ఉంటుంది.

నాణ్యత లేని సెల్‌ఫోన్‌లను పంపిణీ చేయగా అవి పనికిరాకుండా పోవడంతో సొంత ఫోన్లతో డేటా పనులు పూర్తి చేయాల్సి వస్తుంది. పలు ప్రాంతాల్లో సెల్ ఫోన్ సిగ్నల్స్ సక్రమంగా పనిచేయని సందర్భాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కూడా లేదు. ఆరోగ్య భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, సంక్షేమ పథకాలు అందడం లేదు.

పని ఒత్తిడి అంతా వీరిపైనే

ప్రజలు నివసించే ప్రతి చోటా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు తెలపడంతో ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ లేనిచోట మినీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. వీటిల్లో ఇద్దరు చేయాల్సిన పని ఒక్కరు మాత్రమే చేయాల్సి వస్తుంది. దీంతో మినీ అంగన్‌వాడీ కార్యకర్తల బ్రతుకులు అధ్వానంగా మారాయి. ఓ పక్క ఉద్యోగం చేసుకుంటూనే, మరో వైపు అదనపు పనులు చేస్తూ ఇచ్చే అరకొర జీతంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని, అప్పులు చేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలతో పోల్చుకుంటే వేతనాలు ఏ మూలకూ సరిపోవడం లేదని కలత చెందుతున్నారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావం అన్ని రంగాలపై పడుతుంది. ఈ కారణంగా నిత్యావసర సరుకులు, కూరగాయలు, ఉప్పులు, పప్పుల ధరలు భగ్గుమంటున్నాయి. ధరలు ముప్పేట దాడి చేస్తుండడంతో వేతన జీవులు అనేక వెతలు పడుతున్నారు.

వేతనాలు పెంచాలి

ఐసిడిఎస్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్రాలను సక్రమంగా నడుపుతున్నాం. కానీ ప్రభుత్వం మాపై చిన్నచూపు చూస్తుండడం బాధాకరం. పెరుగుతున్న నిత్య అవసరాలకు ప్రభుత్వ ఇస్తున్న వేతనాలు ఏ మాత్రం సరిపోవడం లేదు. మినీ వర్కర్లకు కనీస వేతనాలు అందించి ఆదుకోవాలి.

బి.బాంధవి,మినీ వర్కర్, సహపురం, పెదపూడి మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రభుత్వం ఇస్తున్న చాలీచాలని వేతనాలు కుటుంబ పోషణకు ఏ మాత్రం సరిపోవడం లేదు. అప్పులు చేసి జీవనం సాగించాల్సి వస్తుంది. బారెడు చాకిరీ చేస్తున్నా అరకొర వేతనాలే ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలి.

- అమ్మాజీ, మినీ వర్కర్, పండూరు, కాకినాడ రూరల్ మండలం

చేసిన సేవలతోనే గుర్తింపు



బదిలీ అయిన సిఐ కొండయ్య దంపతులకు సత్కారం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

విధి నిర్వహణలో సేవా భావంతో అందించిన సేవలే గుర్తింపుని ముమ్మిడివరం సిఐ ఎం.మోహన్ కుమార్ పేర్కొన్నారు. గర పంచాయతీ పరిధిలోని స్థానిక అంబేద్కర్ కన్వెన్షన్ హాలు నందు మంగళవారం దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన సిఐ కొండయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా కొండయ్య దంపతులను సిఐ మోహన్ కుమార్ మరియు మూడు పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత కొండయ్య మాట్లాడుతూ తాను నిరుపేద కుటుంబం నుంచి నేడు ఈ స్థాయికి చేరుకున్నానంటే, దానికి చదువే కారణమన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అలాగే పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో చెల్లి అశోక్, కాశి మూర్తి, జొన్నాడ రాజారావు, కాశి రామ చంద్రరావు, ముమ్మిడివరం ఎస్ఐ జ్వాలా సాగర్ మరియు స్టేషన్ సిబ్బంది మరియు పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి : సిఐ విద్యాసాగర్

అవగాహన కల్పిస్తున్న రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మోటార్ సైకిల్ మీద ప్రయాణం చేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్ అన్నారు. మంగళవారం మండలంలోని లొల్లలాకుల వద్ద వాహనాలను స్థానిక ఎస్ఐ ఎస్.శ్రీనివాస్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేనివారికి అపరాధ రుసుము విధించారు. అనంతరం మోటార్ సైకిల్ మీద ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే ప్రమాదాల గురించి ఆయన వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన పేర్కొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కొత్తూరు సెంటర్లో సిబ్బందితో ఎస్ఐ అశోక్

ప్రజాశక్తి - ఆలమూరు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు ఎవరైనా చర్యలు తప్పవని ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరు, కొత్తూరు సెంటర్లో ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ, గ్రామాల్లో అల్లర్లకు పాల్పడే వారి పట్ల కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. మద్యం తాగి వాహనాలు డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని సూచించారు. మండల పరిధి 18 గ్రామాల్లో నిరంతరం నిఘా ఉంటుందని ఆయన తెలియజేశారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు కొనసాగిన శిక్షణ

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు, గ్రామ కార్యదర్శులకు మంగళవారం కొనసాగింది. ఈ శిక్షణలో పలు అంశాలపై వారికి అధికారులు అవగాహన కల్పించారు.

రాజోలు: రెండురోజులుగా రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సర్పంచ్ లు, ఎంపిటిసి సభ్యుల శిక్షణ తరగతులను మంగళవారం ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధాన సమస్య అయిన డ్రైనేజి వ్యవస్థను పునరుద్ధరణ కు కృషి చేస్తానని అన్నారు.కొన్ని చోట్ల మూడు నుంచి నాలుగు గ్రామాలకు ఒక్కరే కార్యదర్శి ఉన్నారని దానివలన గ్రామాల్లో అభివద్ధి పనులు జరగడం లేదని అన్నారు. ఖాళీగా ఉన్న చోట సచివాలయ కార్యదర్శులను నియమించి వారికి పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించాలని ఎంపిడిఓను ఆదేశించారు. రెండు సబ్ స్టేషన్లకు ప్రతిపాదనలు పంపామని అన్నారు. కరెంటు సమస్య పరిష్కారానికి రాజోలు, లక్కవరం సబ్ స్టేషన్ లను అఫ్ గ్రేడ్ చేస్తామన్నారు. సుమారు రూ.10 కోట్లతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణ త్వరలో పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కేతా శ్రీనివాస్, వైస్ ఎంపిపి పొలమూరి శ్యాంబాబు, ఎంపిడిఒ ఎన్.బాలాజీ, ఇఒపిఆర్‌డి జి.భీమారావు, ఆయాగ్రామాల సర్పంచ్ ల తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** మండలంలోని 17 గ్రామ పంచాయతీల సర్పంచ్ లకు పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పాలనపై మంగళవారం రెండో రోజు శిక్షణ ఇచ్చారు. చెత్త నుంచి సంపద తయారీపై ఎంపిడిఒ కెవి.ప్రసాద్ అవగాహన కల్పించారు. పంచాయతీలో విధులు నిధుల వినియోగం పై పంచాయతీ కార్యదర్శులు దాసరి కష్ణాజీ, వీధి సత్యనారాయణ అవగాహన కల్పించారు. సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎఒ ఎంఎల్ఎన్ మూర్తి పాల్గొన్నారు. **మామిడికుదురు:** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వేణు గోపాల రెడ్డి ఆధ్వర్యంలో రెండవ రోజైన మంగళవారం సర్పంచులకు, కార్యదర్శులకు ఇఒపిఆర్‌డి అడబాల శ్రీనివాసరావు, కార్యదర్శి పట్టి లింగంలు పలు అంశాలపై అవగాహన కల్పించారు పాశర్లపూడిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రానికి తీసుకువెళ్లి గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి వాటి నుంచి సంపద తయారు చేసే విధానము పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో మండల పరిపాలనాధికారి కారుపల్లి వెంకటేశ్వరరావు మరియు సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** మండలంలోని వెల్ల గ్రామ పంచాయితీ వద్ద మంగళవారం చెత్త నుంచి సంపద తయారీ, వర్మీ కంపోస్టు ఆదాయం పై ఇఒపిఆర్‌డి సెలట్ రాజు సర్పంచులకు కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. వెల్ల గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. రెండోవ రోజు శిక్షణకు సర్పంచ్ లు,పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు. పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ పై క్షేత్ర స్థాయి పర్యటన పారిశుధ్యం తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్స్ శిక్షణలో వివరించారు. మండల పరిషత్ అభివద్ధి అధికారి ఎన్.వి.రామచంద్రమూర్తి, రిసోర్స్ పర్సన్స్ విఎస్.సుబ్రహ్మణ్యం, ఆర్ఎమ్ వివిఎన్.ఈశ్వరరావు, సుందర్ లాల్, పి.త్రినాథ్ శిక్షణ నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ సర్పంచులకు, కార్యదర్శులకు సచివాలయ ఉద్యోగులకు , మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రెండో రోజు మంగళవారం రిఫ్రెషర్ శిక్షణ తరగతులు కొనసాగాయి. గ్రామ అభివద్ధి ప్రణాళిలు, పరిశీలనా విధానం, వీధి లైటింగ్, పంచాయతీలలో ఎలక్ట్రిసిటీ బిల్లులు తదితర అంశాలపై కార్యదర్శులకు, సర్పంచులకు, సచివాలయ ఉద్యోగులకు టిఒటిలు సిహెచ్‌వివి.నరసింహారావు, కె.రామకష్ణ, వెంకటేశు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి, మండల ప్రత్యేకాధికారి ఎ.శాంతి, ఎంపిడిఒ కొండలరావు, ఐసిడిఎస్ డిపిఒ ఎ.గజలక్ష్మి, టిఒటిలు రామకష్ణ, నరసింహరావు, వెంకటేశులు, సచివాలయ ఉద్యోగులు సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపదపై అవగాహన కల్పిస్తున్న ఉప్పలగుప్తం ఎంపిడిఒ

పాశర్లపూడిలో ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఇఒపిఆర్‌డి

ఆలమూరు: సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్క్ కంపోస్ట్ పై ప్రతి ఒక్కరూ దష్టి సారించి పంచాయతీలకు ఆదాయాన్ని పెంపొందించాలని ఎంపిడిఒ ఎ.మేరి రోజ్, ఇఒపిఆర్‌డి రాజ్ కుమార్ అన్నారు. ఎస్ డబ్ల్యు పిసి కేంద్రం వద్ద మంగళవారం చెత్త నుంచి సంపద తయారీ, వర్మీ కంపోస్టు ఆదాయంపై వారు సర్పంచులకు, కార్యదర్శులకు రెండవ రోజు శిక్షణ నిర్వహించారు. ఇందులో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు. ఇందుకు పారిశుధ్యం వాటి నిర్వహణ పై క్షేత్ర స్థాయి పర్యటన తప్పకుండా ఉండాలన్నారు. పలు విషయములపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో రామ్ స్వరూప్ సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలమూరులో నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న సర్పంచులు, కార్యదర్శులు

ఉపాధ్యాయుల డైరీ ఆవిష్కరణ

డైరీ ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ, ఎంఇఒ

ప్రజాశక్తి-అయినవిల్లి

యుటిఎఫ్ 50 సంవత్సరాల స్వర్ణోత్సవాల సందర్భంగా ఉపాధ్యాయుల డైరీ ఆవిష్కరణ మంగళవారం అయినవిల్లి మండల అభివద్ధి అధికారి టిఎస్.మూర్తి, ఎంఇఒ పి శ్రీనివాసు చేతులు మీదుగా ఉపాధ్యాయుల డైరి ఆవిష్కరణ చేసి ఉపాధ్యాయులకు అందించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయుల ప్రగతితో పాటు సామాజిక చైతన్యలో ముందుంటుందని అన్నారు. ఎంఇఒ పి. శ్రీనివాసు మాట్లాడుతూ యుటిఎఫ్ ఈ 50 ఏళ్ల కాలంలో సాధించిన విజయాలు ఉపాధ్యాయులుకు ఎంతగానో సహాయ పడ్డాయన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు టిబి.ఈశ్వర రావు, ప్రధాన కార్యదర్శి పిఎస్.నాగేంద్ర రావు, జి. సాయి శ్రీనివాస్, యం.రామకృష్ణ, జి.గంగాద్రి, కె.సురేష్‌బాబు, ఎ.సూర్యనారా యణ, ఐవి.శివప్రసాద్, పుల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన

ప్రజాశక్తి -ఆత్రేయపురం

ర్యాలి మ్యాజిక్ హౌస్ లో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీకా అమత్ మహోత్సవంలో భాగంగా మంగళవారం నాలుగు సంవత్సరాల ప్రపంచ రికార్డు సాధకుడు బళ్ల రుషిత్ తన తాత శ్యామ్ జాదూగర్ మేనమామ మోహిత్ లతో కలిసి 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని చేసిన ఇంద్రజాల ప్రదర్శన విశేషంగా కట్టుకుంది. ఈ సందర్భంగా రుషిత్ వస్త్రధారణతో భారతీయుడి వేషధారణలో 78 జాతీయ జెండాలను సష్టించి దేశభక్తిని చాటుకున్నాడు.

కార్టూ'నిజం'

మెమెంటోలు అందుకుంటున్న అంబాజీపేట విద్యార్థినులు

క్విజ్ పోటీల్లో విద్యార్థినులకు తృతీయ స్థానం

ప్రజాశక్తి-అంబాజీపేట

ఎపి స్టేట్ బయోడైవర్సిటీ బోర్డు డిపార్ట్‌మెంట్ ఆప్ స్కూల్ ఎడ్యుకేషన్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో 'జీవన వైవిధ్యం' అంశంపై అంబాజీపేట హైస్కూల్ విద్యార్థులు కుడిపూడి యశస్విని శ్రీ, ఆకుల లక్ష్మీ ప్రసన్న తృతీయ స్థానం సాధించారని హెచ్ఎం కె.సాయిరాం మంగళవారం తెలిపారు. అమలాపురంలో జరిగిన కార్యక్రమం లో డిఇఒ ఎం.కమలకుమారి, డివైఇఒ జి.సూర్య ప్రకాష్, డిఎస్ఒ జి.వి.సుబ్రహ్మణ్యం, గ్రీన్ కోర్ జిల్లా కో ఆర్డినేటర్ కడలి సాయి రాం, ప్రభావతి, బిఎస్ఎన్.మూర్తి చేతుల మీదుగా విద్యార్థులకు మెమోంటోలు, ప్రశంసా పత్రాలు అం దుకున్నారు. పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ పితాని త్రిమూర్తులు, వైస్ ఛైర్మన్ బండారు అమ్మాజీ విజేతలను అభినందించారు.

బాలోత్సవంలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-యంత్రాంగం

ఇటీవల కొత్తపేటలో జిల్లా స్థాయి కోనసీమ బాలోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొని వివిధ విభాగాల్లో తమ ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయా పాఠశాలల్లో విద్యాకమిటీలు, ఉపాధ్యాయులు మంగళవారం అభినందనలు తెలిపారు.

ప్రశంసాపత్రాలతో పాలగుమ్మి జెడ్‌పి విద్యార్థులు

అయినవిల్లి: కొత్తపేట లో జరిగిన కోనసీమ బాలోత్సవములో అయినవిల్లి మండలం ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలలో జూనియర్స్ విభాగంలో స్పెల్ బి, జానపద గీతాలు, సీనియర్స్ వ్యాసరచన, ఇంటర్నెట్ అన్వేషణ, సీనియర్ క్విజ్, సీనియర్స్ చిత్రలేఖనంలో పలువురు విద్యార్థులు మెమెంటోలు, మెడల్స్, ప్రశంసా పత్రాలు సాధించారు. ఈ సందర్భంగా వీరిని మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వర రావు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ యడ్ల లక్ష్మీ దుర్గ , సిరిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ కుడుపూడి శాంతావతి, ఉపాధ్యాయులు జి. సాయి శ్రీనివాస్, ఆర్.భాస్కరరావు, వై.ఫణికుమార్ అభినం దించారు. **అమలాపురం రూరల్:** కోనసీమ బాలోత్సవంలో అమలాపురం మండలం పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ బహుమతులు గెలుపొందారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుంట్రు వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 39 అకడమిక్,19 కల్చరల్ ఈవెంట్స్ లో మొత్తం 58 ఈవెంట్స్ లో విద్యార్థినీ, విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. ఈ మేరకు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పాలగుమ్మి విద్యార్థులు వివిధ ఈవెంట్స్ లో బహుమతులు అందుకున్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ప్రశంసా పత్రాలతో ముక్తేశ్వరం జెడ్‌పి విద్యార్థులు

సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలి

ప్రజాశక్తి -అమలాపురం

అమలాపురం కలెక్టరేట్లోని కలెక్టర్ చాంబర్లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ 3వ సమావేశం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్లపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 166 ప్రైమరీ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీలను ఆగస్టు 31 లోపు కంప్యూటరైజేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కంప్యూటరైజేషన్ లో భాగంగా డేటా క్యాప్చర్ టూల్ ద్వారా జిల్లాలోని పిఎసిఎస్‌లోని సభ్యుల వివరాలు, పిఎసిఎస్ ఇచ్చిన లోన్లు, సొసైటీల ఆస్తులు తదితర వివరాలను క్యాప్చర్ చేసి ఆన్లైన్లో ఉంచాలన్నారు. జిల్లాలో నాలుగు పిఎసిఎస్‌లు పెట్రోల్ బంకులు నడపడానికి అనుమతుల కోసం దరఖాస్తు చేసి ఉన్నాయని సంబంధిత సొసైటీలకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. కౌలు రైతులు పంట రుణాలు పొందేందుకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సిసిఆర్‌సి కార్డులు ఉన్న ప్రతి రైతుకూ పంట రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమ ంలో జిల్లా జెసి టి.నిషాంతి, జిల్లా సహకార అధికారి మురళి కృష్ణ, నా బోర్డు డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ మేనేజర్ సోమి నాయుడు, డిసిసిబి సిఇఒ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేషన్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ డివిఎస్

రాష్ట్ర స్థాయి టైక్వాండో పోటీలకు దీప్తి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి -మామిడికుదురు

విశాఖలో ఈ నెల 17న నిర్వహించే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల మొదటి సెమిస్టర్ బిఎస్‌సి విద్యార్థి కడలి దివ్య తేజ వెంకటేష్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డివివి.సత్య నారాయణ మంగళవారం తెలిపారు. ఈ నెల 11న కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వెంకటేష్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడన్నారు. విద్యార్థి వెంకటేష్‌ను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు డివివిఎస్ చెప్పారు. ఈ సందర్భంగా వెంకటేష్ ను ఆయనతో పాటుగా కోచ్‌లు కె.చిన్న, ఆర్.మణికుమార్, సహాయ ప్రిన్సిపల్ మోకా రంగారావు, యాలంగి రవికుమార్, పెచ్చెట్టి రాధ తదితరులు అభినందించారు.

నేరాలు ఘోరాలు

వివాహిత హత్య

ప్రజాశక్తి - సీతానగరం

పురుషోత్తపట్నం గ్రామంలో పాత తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకం వద్ద మంగళవారం తెల్లవారుజామున వివాహిత హత్యకు గురైంది. ఆమె భర్తే హత్య చేసినట్టు అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం దండంగి గ్రామానికి చెందిన చాట్ల జాన్, భార్య దివ్యభారతి, కుమార్తె, ఇద్దరు కుమా రులతో కలిసి కొంతకాలంగా పురుషోత్తపట్నం గ్రామంలో ఉంటున్నారు. పాన్‌షాప్ నిర్వహిస్తూ కుటుం బాన్ని పోషించుకుంటున్నారు. కొంతకాలంగా భార్యా భర్తల మధ్య వివాదాలు చోటు చేసుకున్నాయి. గతంలో భార్య ఫిర్యాదు మేరకు జాన్ జైలుకు కూడా వెళ్లాడు. తరువాత కొంత కాలం కాపురం సజావుగా సాగింది. పదిహేను రోజులుగా ఇద్దరి మధ్య మళ్లీ వివాదం నెలకొంది. అప్పటి నుంచి వారు వేర్వేరుగా ఉంటున్నా రు. మంగళవారం ఉదయం దివ్యభారతి బహిర్భూమికి వెళ్లింది. అక్కడ ఆమె విగతజీవిగా పడి ఉంది. ఆమె అరచేతులు, మెడ, తలపై కత్తితో నరికిన గాయాలు ఉన్నాయి. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని కోరుకొండ సిఐ ఆధ్వర్యంలో సీతానగరం ఇన్‌ఛార్జి ఎస్ఐ ఆనంద్‌కుమార్ పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కరప

గుళికలు మింగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కరపలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ పి.శోభన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు కరపకు చెందిన ఇంజరపు సత్యనారాయణ వెల్డింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆరు నెలల క్రితం కరప ప్రధాన రహదారిలో సొంతంగా షాపు పెట్టుకున్నాడు. పనులు లేక అప్పులు చేశాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఉదయం 6 గంటలకు తన షాపు వద్ద పంటకు వేసే గుళికలు తిన్నాడు. ఇది గమనించి ఓ బాలుడు వెంటనే సత్యనారాయణ భార్య దేవికి సమాచారం ఇచ్చాడు. వెంటనే ఆమె షాపు వద్దకు వెళ్లి సత్యనారాయణను కాకినాడ జిజిహెచ్‌కు తరలించింది. అప్పటికే సత్యనారాయణ(45) మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

3.150 కేజీల పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - పిఠాపురం

పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనంతోపాటు, 3,150 కేజీల పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో మంగళవారం మండలం లోని బి.ప్రత్తిపాడు గ్రామంలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఒక వాహనంలో 58 సంచుల్లో 3,150 కేజీల బియ్యాన్ని అధికారులు గుర్తించారు. వాహనంతోపాటు, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని రవాణా చేస్తున్న ఆకుల గంగరాజుపై కేసు నమోదుకు పిఠాపురం రూరల్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యం, వాహనం విలువ రూ.8,93,325 ఉంటుందని రీజనల్ విజిలెన్స్ ఎస్పి కెఎస్ఎస్‌వి.సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ టి.జగనాథ రెడ్డి, పిఠాపురం సిఎస్‌డిటి వీరాస్వామి, కానిస్టేబుల్స్ లోవరాజు, శివ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బాలునిపై దాడి..తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట జి.రాఘంపేట రోడ్డులో జగనన్న కాలనీ వద్ద ఇద్దరు మైనర్ బాలురుపై పలు వురు దాడి చేశారు. ఈ దాడిలో స్థానిక బలుసులపేటకు చెందిన దడాల దయ (16)కు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే బాలునికి చెందిన వారు దాడికి పాల్పడిన వారిపై తిరగబడ్డారు. కాగా గాయాలతో ఉన్న అతనికి చికిత్స అందించేందుకు సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నిరాకరించారు. దీంతో ఆసుపత్రి వద్ద బాలుని బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఈ దాడి సంఘటనకు సంబంధించి ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - గోకవరం

తంటికొండలో సారాను విక్రయిస్తున్న ద్వారంపూడి శివరామకృష్ణను పోలీసులు అరెస్టు చేశారు. హెచ్‌సి అబ్బుల దొర ఆధ్వర్యంలో దాడి చేసి నిందితుని పట్టు కున్నారు. అతని నుంచి 15 లీటర్ల సారా, బైకును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని మోదుకూరులో పేకాట శిబిరంపై ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ తన సిబ్బం దితో కలిసి మంగళవారం ఆకస్మిక దాడులు చేసి నలు గురిని అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో గొడితి రాజు (మోదుకూరు), పాడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ (ఏడిద), కొవ్వాడ నవీన్ (లాలాచెరువు), గంధం విజయకుమార్ (ఏడిద సీతానగరం)లను అరెస్టు చేసి వారి నుంచి రూ.2,900 స్వాధీనం చేసుకున్నారు. నలు గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పెట్రోల్ ట్యాంకర్‌కు మంటలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక అయ్యప్ప స్వామి గుడి సమీపంలో జాతీయ రహదారిపై వెళ్తున్న పెట్రోల్ ట్యాంకర్ నుంచి మంటలు చెలరేగాయి. సకాలంలో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది పెను ప్రమాదం జరగకుండా మంటలను అదుపు చేశారు. విశాఖపట్నం అచ్యుతాపురం నుంచి యానం ఫ్లాష్ పెట్రోల్ బంకుకు 25 వేల లీటర్ల పెట్రోల్, డీజిల్‌తో వస్తున్న ట్యాంకర్ తాళ్ళరేవు వద్ద టైరు పేలడంతో మంటలు చెలరేగాయి. దీంతో వెనక ఉన్న నాలుగు టైర్లకు మంటలు వ్యాపించాయి. దీంతో కోరంగి పోలీసులు, అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో జగన్నాథపురం, యానం, గాడిమొగ రిలయన్స్ నుంచి నాలుగు అగ్నిమాపక ఇంజన్లు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

యానాం వార్తలు

ర్యాలీలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు,సిబ్బంది

జాతీయ జెండాలతో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా స్థానిక పురవీధుల్లో జాతీయ జెండాలతో భారీ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పరిపాలనాధికారి మునిస్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఆపాదమిత్ర వాలంటీర్లు, స్వయం సహాయక బృందం సభ్యులు, వివిధ ప్రభుత్వ రంగ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - యానాం

యానాంలో మున్సిపల్ ఉద్యోగులు మంగళవారం ఉదయం ఆందోళన నిర్వహించారు. తమ న్యాయమైన కోరికలు తీర్చాలంటూ యానాం పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. బకాయి పడిన జీతాలను అందించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని, డిఎటి ద్వారా జీతాలు ఇవ్వాలని , ఉద్యోగులు పెన్షనర్లకు సంబంధించిన ఆరు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని యానాం పరిపాలనాధికారి మునిస్వామికి అందజేశారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశాల్లో స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పారా టీచర్స్‌ని రెగ్యులర్ పద్ధతిలో తీసుకోవాలని, మిల్క్ బాయిలర్‌కి రూ.18 వేలు జీతం పెంచుతామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని, సిబ్బంది పనితీరు చాలా దారుణంగా ఉందని, పోస్టుమార్టం చేయడానికి తప్ప ఎందుకు పనిచేయడం లేదని అన్నారు. ధర్నాలు చేస్తేనే గాని ఫ్రీజర్ బాక్స్‌లు పంపని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. కొన్ని శాఖలలో సిబ్బందికి జీతాలు లేవని వాటిని తక్షణమే చెల్లించాలన్నారు. 2011 నుంచి సుమారు 600 పైగా వివాహానికి ఇచ్చే రుణాలు కోసం ప్రజలు దరఖాస్తు చేసుకున్నారని వాటిని ఇప్పటివరకు పరిష్కరించలేదన్నారు.

అథ్లెటిక్స్ సెలక్షన్స్‌లో ఆదిత్య విద్యార్థులు

ప్రజాశక్తి - గండేపల్లి

ఈ నెల 11న కాకినాడ పిఆర్ కాలేజీలో జరిగిన అండర్-23 అథ్లెటిక్స్ జిల్లా సెలక్షన్ ట్రయల్స్‌లో ఆదిత్య విద్యా సంస్థల నుంచి 11 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సెలక్షన్ ట్రయల్స్‌లో ఆదిత్య విద్యార్థులు 9 మంది ఎంపికయ్యారు. ఈ ఏడాది సెప్టెంబర్ 14, 15, 16 తేదీల్లో గుంటూరులో జరిగిన స్టేట్ మీట్‌లో పాల్గొనడానికి అర్హత సాధించారని డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదిత్య డిప్యూటీ ప్రో ఛాన్సలర్ శ్రీనివాస్ రెడ్డి, ప్రో. వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ జి.సురేష్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఒడి జివి.ప్రతాప్‌రెడ్డి, కోచ్‌లు బి.అఖిల్ గౌతమ్, బి.దీపిక విద్యార్థులను అభినందించారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు పర్యవేక్షణ అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

మాదకతవ్యాల నియంత్రణకు పర్యవేక్షణ అవసరమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు ఆదిలక్ష్మి తెలిపారు. మంగళవారం జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి కె.ప్రవీణ ఆధ్వర్యంలో సిడిపిఒ జ్యోతి అధ్యక్షతన పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణలో విద్యా సంస్థల యాజమాన్యాలు, ఆధ్యాపకులు, అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ తప్పనసరి అని అన్నారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు, యువత, చెడు స్నేహాలు, మత్తు పదార్థాలకు అలవాటు పడి, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. దీంతో అధికారుల సమన్వయంతో డ్రగ్స్ నియంత్రణకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ తిరుపాయన్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్.వెంకటరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనుచంద్రిక, కళాశాల అధ్యాపకులు డాక్టర్ జాన్సన్, చైల్డ్‌హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలక్ష్మి

పుష్కర ద్వారా సాగునీటిని విడుదల చేయాలి

ప్రజాశక్తి - గండేపల్లి

జగ్గంపేట, గండేపల్లి మండలాల్లోని 37 ఎకరాల ఆయకట్టుకు పుష్కర ద్వారా సాగునీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మారోతి శివగణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం తాళ్లూరు లిఫ్ట్ ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో తాళ్లూరు పుష్కర లిఫ్ట్ ఎత్తు పోతల పథకాన్ని కాంగ్రెస్ పార్టీ పాలనలోనే ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. పుష్కర స్టేజ్-2 లిఫ్ట్‌కు సంబంధించి పైపులైన్ మరమ్మతులు చేయడంలో వైసిపి ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తక్షణమే పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి నియోజకవర్గంలోని 37 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ఈ ఏడాదికి పుష్కర ద్వారా నీటిని విడుదల చేయలేమని స్థానిక ఎంఎల్ఎ చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పైపులైన్ మరమ్మతుల కోసం అవసరమైన నిధులను రాబట్టేందుకు కృషి చేయాలని హితవు పలికారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వత్సవాయి సత్యనారాయణరాజు, డాక్టర్ నక్క సత్యనారాయణ, చంద్రమౌళి, చిన్నారి పాల్గొన్నారు.

తాళ్లూరు లిఫ్ట్‌ను పరిశీలిస్తున్న శివగణేష్

అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు ఆహారం

ప్రజాశక్తి - పెద్దాపురం

పేదలకు ఆహారాన్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తుందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పాలనలో పేదలకు ఆహారాన్ని అందించేందుకు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిందన్నారు. ఈ నెల 16 నుంచి ఈ క్యాంటీన్ ప్రారంభించబడుతుందని, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు, మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, డిఇఇ ఆదినారాయణ, జనసేన పట్టణ అధ్యక్షులు పోలమరశెట్టి సత్తిబాబు, రంది సత్యనారాయణ, యాళ్ల వీరబాబు, తూతిక రాజు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఆధ్వర్యంలో తిరంగా ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా మంగళవారం సీనియర్ సిటిజన్స్, పాఠకులు తిరంగా ప్రతిజ్ఞ చేశారు. గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు అల్లంరాజు శివరామకృష్ణ సుబ్రహ్మణ్యేశ్వరప్రసాద్, చింతా సాంబశివరావు, పాఠకులు అప్పారావు, ఎల్ రాజు, కాటమరాజు, పి.రాజేష్, పాల్గొన్నారు.

ఎంఎల్ఎ చినరాజప్పను సత్కరిస్తున్న సంఘీయులు

చేనేత సంఘాల ఆధ్వర్యంలో సన్మానాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక గౌరీ కోనేరు సెంటర్‌లోని ముప్పన రామారావు చేనేత భవనంలో మంగళవారం చేనేత సంఘాల ఆధ్వర్యంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కూటమి నాయకులు తుమ్మల బాబు, విత్తనాల వెంకటరమణ, రాజా సూరిబాబు రాజులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు అంకయ్య పేట సెంటర్ లోని శిథిలావస్థలో ఉన్న బసవేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ పునర్నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఆలయ పునర్నిర్మాణానికి 20 శాతం నిధులు ప్రజలు పెట్టుకుంటే, 80 శాతం నిధులు ప్రభుత్వం ద్వారా అందజేస్తానని ఎంఎల్ఎ చినరాజప్ప ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, ముప్పన రామారావు చేనేత వీవర్స్ కమ్యూనిటీ భవనం అధ్యక్షులు జెట్టి రాజబ్బాయి, కార్యదర్శి తూతిక రాజు, ఎర్రా ఆదినారాయణ,పేరిశెట్టి మృత్యుంజయరావు, తూతిక చంద్రశేఖర్, చల్లా సత్యనారాయణ, మల్లిపెద్ది కోటిలింగేశ్వరరావు, చింతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల నిర్వహణపై సమీక్ష

- గ్రామాల వారీగా సదస్సుల నిర్వహణ ప్రణాళికను రూపొందించాలి
- సదస్సులకు అవసరమైన రెవెన్యూ రికార్డులను అధికారులు సిద్ధం చేసుకోవాలి
- ఈనెల 16 నుంచి రెవెన్యూ సదస్సులు
- జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

పాల్గొన్న తహశీల్దార్లు, డిటీలు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బి ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ లోని గోదావరి భవన్ లో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమాం, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి రెవెన్యూ సదస్సుల నిర్వహణపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఇందుకు రెవెన్యూ యంత్రాంగం మొత్తం సమాయత్తం కావాలని తహశీల్దార్ లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 30 వరకు 45 రోజుల పాటు జిల్లా లోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారన్నారు. దీనిలో భాగంగా ఏ గ్రామంలో ఏ తేదీలో సదస్సులు నిర్వహిస్తారనే అంశం పై తగు ప్రణాళికను పకడ్బందీగా సిద్ధం చేయాలన్నారు. ప్రధానంగా మ్యూటేషన్, వెబ్ ల్యాండ్ లో కరక్షన్ లు, 1బి, దారి సమస్య, భూ తగాదాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఇలాంటి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సదస్సులను నిర్వహిస్తున్నదని, ఇందుకు అవసరమైన రికార్డులను అధికారులు సిద్ధం చేసుకోవాలన్నారు. 22ఏ, ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి అన్ని విషయాలను పరిశీలించి అందుకు సంబంధించి రికార్డులను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి తహశీల్దార్ ప్రాథమికంగా వారి పరిధిలో ఏ రెవెన్యూ గ్రామంలో ఎక్కువ సమస్యలు వచ్చే అంశం పై ఒక నిర్ధారణకు వచ్చి రెవెన్యూ సదస్సుల నిర్వహణలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీఆర్వోలు విలేజ్ సర్వేయర్లు సచివాలయ స్థాయిలో గ్రామసభలు నిర్వహించి రైతుల సమస్యలను ఈ 45 రోజుల్లో అర్జీల రూపంలో తీసుకొవాల న్నారు. మరో 45 రోజులలో సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దష్టి పెట్టి మండల బందం సమర్థవంతంగా పని చేయాలన్నారు. సదస్సుల్లో మండల సర్వేయర్, దేవాదాయ, వక్ఫ్ బోర్డు, రిజిస్ట్రేషన్, అటవీ శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రతి మండలానికి ఒక స్పెషల్ ఆఫీసర్ ను నియామకంతో పాటు ఆర్‌డిఒలు వారి డివిజన్ పరిధిలో మండలాలలో జరుగు సదస్సుల నిర్వహణను ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు.కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయాలని తెలిపారు. రైతు సంఘాలకు ప్రజాప్రతినిధులకు జిల్లాస్థాయిలో రెవెన్యూ సదస్సుల కార్యక్రమం పై అవగాహన కల్పిస్తామన్నారు. సదస్సుల నిర్వహణకు ముందుగానే విఆర్ఒలు, విఆర్ఎలు, రెవెన్యూ సిబ్బందితో తహశీల్దార్లు ముందస్తు సమావేశం నిర్వహించుకుని, సదస్సుల నిర్వహణ పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. సదస్సులో తహశీల్దార్‌లు, ఆర్ఐ, సర్వేయర్లు అన్ని రకాల రికార్డులను తీసుకు వచ్చి పరిశీలించడంతో పాటు ఏ సమస్యకైనా నిర్ణీత సమయంలోపు నోటీసులిచ్చి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఏ రోజున ఏ గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామనే అంశాన్ని ప్రజలకు తెలిసేలా పత్రికల ద్వారా, టాం టాం ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఆర్‌డిఒ జి కేశవర్ధన్ రెడ్డి, కొత్తపేట ఆర్‌డిఒ జెవివి. సత్యనారాయణ, రామచంద్రాపురం ఆర్‌డిఒ ఎస్.సుధా సాగర్, సర్వే ఎడి ప్రభాకర రావు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్‌లు, సర్వేయర్లు, ఆర్ఐలు, విఆర్ఒలు, తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రణాళిక రూపొందించాలి

ప్రజాశక్తి-అమలాపురం

వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉపాధి హామీ పనుల కింద తమ తమ శాఖల్లో ఆవశ్యకత కలిగిన పనులను పూర్తి చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమలాపురం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఉపాధి హామీ చట్టం పనుల కు సంబంధించి వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో 2025 మార్చి 31 వరకు జిల్లాకు సంబంధించి ఉపాధి హామీ కింద 56 లక్షల పని దినాలకు అనుమతి మంజూరు అయిందన్నారు. జిల్లాలో 1620 ఎకరాల్లో ఉద్యానవన పంటల ప్లాంటేషన్‌కు ఉపాధి హామీ పనుల కింద లక్ష్యం నిర్దేశించారన్నారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ లక్ష్యాన్ని సాధించాలన్నారు.

భార్య కేసు పెట్టడంతో భర్త అదృశ్యం

ప్రజాశక్తి - మామిడికుదురు

భార్య కేసు పెట్టిందని భయపడి ఇల్లు వదిలి అదృశ్యమైన భర్త సంఘటన పాశర్లపూడిలో జరిగింది. వేగి వెంకటేశ్వరరావు కుమారుడు వెంకట రత్నంకు 2021 లో పేరూరు గ్రామానికి చెందిన పావ నితో వివాహం అయింది. అప్పటినుండి భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతున్నట్లు పది రోజులకు నగరం పోలీస్ స్టేషన్లో రిపోర్టు ఇవ్వగా నగరం ఎస్ఐ పిలిచి ఇద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చారు. తదుపరి మరల వేగిపావని భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్ళిపోయినట్లు ఆమె మరలా తన భర్త పై కేసు పెట్టడంతో బయపడి ఇల్లు వదిలి వెళ్ళిపోయినట్లు వెంకటరత్నం తండ్రి వేగి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు యేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నగరం హేడ్ కానిస్టేబుల్ సిహెచ్‌కెఎన్ డి ప్రసాద్ తెలిపారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను పకడ్బందీ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ముమ్మిడివరం తహశీల్దార్ ఎంవి.సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15 నుంచి సెప్టెంబర్30 వరకు జరిగే రెవెన్యూ సదస్సుల్లో భాగంగా మండలంలో 16న అన్నంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, 19న గాడిలంక, 21న కర్రి వాని రేవు, 23న కొత్త లంక, 24న చిన కొత్తలంక,27న మర్ల పాలెం,29 న కోమానపల్లి, సెప్టెంబర్3న గేదెల్లంక,5న అయినాపురం, 6న ఠానేలంక, 10న లంక ఆఫ్ ఠానేలంక, 12న కమిని, 13న సిహెచ్ గున్నేపల్లి, 17న అనాతవరం, 19న క్రాప చింతలపూడి, 20న పళ్ళ వారి పాలెం, 21న క్రాప చింతలపూడి రాయుడు పాలెం సచివాలయం, 24న గొల్లల విధి మరియు పోలమ్మ చెరువు సచివాలయాల పరిధిలోని నగర పంచాయతీ కార్యాలయం నందు, 25న రాజుపాలెం సచివాలయం, 26న పళ్ళిపాలెం సచివాలయం, 27న సూరాయి చెరువు 28 బొండాయి కోడు తూము సచివాల యాలవద్ద రెవెన్యూ సదస్సు నిర్వహిస్తారన్నారు. భూ సంబంధిత సమస్య లపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి అన్ లైన్ లో నమోదు చేసి రశీదులు అందించనున్నామన్నారు. సదస్సుల్లో మండల తహశీల్దార్, ఆర్ఐలు, మండల సర్వేయర్,గ్రామ రెవెన్యూ అధికారి,సంబంధిత అధికారులు పాల్గొంటారని తెలిపారు.

మహిళా మార్ట్‌ను సందర్శన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తంలో మహిళామార్ట్‌ను డిఆర్‌డిఎ ఎపిడి జిలాని మంగళవారం సందర్శించారు. మార్ట్ లో ఉన్న స్టాకును ఆయన పరిశీలించారు. మార్ట్ అమ్మకాలపై ఎపిఎంలు ఎ.సురేంద్ర, భూపతి వర్మలను అడిగి తెలుసుకున్నా రు.రోజువారీ అమ్మకాలను పెంచాలన్నారు. వినియోగదారులు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన సూచించారు.

In the Court of the I Addl. Dist. Judge, Rajahmundry

M.V.O.P. No. 415/2023

Between:

Kakarla Nagi Reddy ...*Petitioner*

AND

1. Ramavarapu Nageswara Rao & another ...*Respondents*

R-1: Ramavarapu Nageswara Rao, S/o. Satyanarayana, D.No. 466/B, Railway Quarters, ILTD Gate, Rajahmundry.

పై నెంబరులో పిటిషనర్, రెస్పాండెంట్-1 అయిన మీకు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్టు ద్వారాను పై పిటిషన్‌లో సమన్లు పంపినప్పటికిని, పై నెంబరు పిటిషన్‌లో పరిహారములు మీకు తెలిసి సమన్లు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సాధారణ పద్ధతిలో అమలు జరుగుట సాధ్యము గాక, ఈ ప్రకటన ద్వారా వాయిదా **ది. 21-8-2024కు వాయిదా అయి ఉన్నది అని తెలియచేయడమైనది. కావున వాయిదా తేది ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో స్వయముగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

G.SRINIVASULU REDDY & ASSOCIATES

Advocates, Rajahmundry

గాంధీని పలకరిస్తున్న యనమల

టిడిపి నాయకుడిని పరామర్శించిన యనమల

ప్రజాశక్తి - కోటనందూరు

తొండంగి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు మాకినీడి గాంధీని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు పరామర్శిం చారు. అనారోగ్యానికి గురియైన సమచారాన్ని తెలుసుకున్న ఆయన మంగళవారం గాంధీ స్వగృహానికి వెళ్లి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆందోళన చెందవద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనిడి అబ్బాయి, మోత్కూరి వెంకటేష్, చొక్కా అప్పారావు , మత్స్యకార సంఘం అధ్యక్షులు కోడా వేంకట రమణ, కొయ్య కేశవ పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో జరుగుతున్న నవోదయ రీజియన్ కబడ్డీ పోటీలు రెండవ రోజు మంగళవారం హోరా హోరీగా జరిగాయి. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ కాటా రామకృష్ణయ్య, శ్రీకాకుళం జిల్లా జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ దాసరి పరశు రామయ్య మాట్లాడుతూ మొదటి రోజు 13 లీగ్ మ్యాచులు నిర్వహించగా రెండవ రోజు ఎనిమిది ఫైనల్స్ కండక్ట్ చేసినట్లు తెలిపారు. ఈ పోటీల సందర్భంగా వివిధ మండలాల నుంచి క్రీడా నిపుణులను ఆహ్వానించి వారి సమక్షంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నా మన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు తిలకించారు.

CHANGE OF NAME

I, **TALATAM USHA** (Old Name), W/o. Talatam Suresh Babu, D.No.2-298, Adhrsha Nagar, Road No.14, Chidiga, Kakinada Rural Mandal, Kakinada District. I have changed my name as **SANKABATHULA USHA** (New Name).

Hereafter my name is known as **SANKABATHULA USHA** (New Name). This is for all records.

ఒరిజినల్ సర్టిఫికెట్లు పోయినవి

నేను నూకపెయ్యి జ్యోతి, భర్త నూకపెయ్యి వినోద్ కుమార్, 1-26, సత్యవాడ, ఉండ్రాజవరం మండలం, తూ॥గో॥జిల్లా, ఆంప్ర. నేను, మండ జ్యోతి అను నా పేరు మీద నం. 1211115418 రు గల పదవ తరగతి మార్కుల లిస్టు ఒరిజినల్, జిరాక్స్ తీయు నిమిత్తం వెళుతుండగా పోయినది. దొరికిన వారు పై అడ్రస్‌లోని సెల్ **9949988028** కు తెలియజేయగలరు.

నూకపెయ్యి జ్యోతి
భర్త : నూకపెయ్యి వినోద్ కుమార్, 1-26, సత్యవాడ, ఉండ్రాజవరం మండలం తూ॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్

పాస్‌పోర్టు పోయినది

కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం, తిమ్మాపురం గ్రామం, సతీష్‌చంద్ర నగర్, డో.నెం. 5-101/14రు కాపురస్తుడు ఆకుల అర్జునరావు గారి కుమారుడు **ఆకుల రాజబాబు** అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. **E6752954**ను ది.28-07-2024న మా ఇంటి నుండి జిరాక్స్ నిమిత్తం తిమ్మాపురం మెయిన్‌రోడ్ సెంటర్‌లో జిరాక్స్ షాపునకు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. సదరు పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు.

ఆకుల రాజబాబు
S/o. అర్జునరావు, డో.నెం.5-101/14
సతీష్‌చంద్ర నగర్, తిమ్మాపురం, కాకినాడ రూరల్
సెల్: 9290766249

ప్రకటన

నా క్లయింటు **గేదెల శాంతాదేవి,** W/o. **వీర రాఘవరావు,** దివిలి గ్రామం, పెద్దాపురం మండలం వారు నాకు తెలియపరిచిన వివరాలు ప్రకారం నేను ఈ పత్రికా ప్రకటన విడుదల చేయుచున్నాను.

నా క్లయింటు **47/1977 నెంబరు గల రిజిష్టర్ దస్తావేజు** మరియు కొన్ని ముఖ్యమైన కాగితములతో కూడిన ఫైలు ది. 29-7-2024న జిరాక్స్ తీయించేందుకు పెద్దాపురం మెయిన్‌రోడ్‌లో వెడుతుండగా పడిపోయినవి. సదరు పైన తెలిపిన దస్తావేజు పెద్దాపురం సబ్‌రిజస్ట్రార్ నందు రిజిష్టర్ అయి వున్నది. సదరు దస్తావేజు నందు దివిలి గ్రామానికి చెందిన దిగువ షెడ్యూల్ ఆస్తికి సంబంధించిన ఆస్తి అయి వున్నది.

<u>షెడ్యూలు:</u> తూర్పుగోదావరి జిల్లా (ప్రస్తుత కాకినాడ జిల్లా), పెద్దాపురం మండలం, పెద్దాపురం సబ్ డివిజన్, దివిలి గ్రామం తాలూకు సర్వే నెంబరు 8/1లో గల డోర్ నెంబర్ 2-79, అసెస్మెంట్ నెంబరు 246 గల పెంకుటి ఇల్లు, డాబా వంట షెడ్, డాబా లెట్రిన్ బాత్‌రూమ్ గల 128.13 చదరపు గజాలు స్థలంతో

తూర్పు: రోడ్, **దక్షిణం:** బోనం సూర్యనారాయణ గారి ఇల్లు, స్థలం. **పడమర:** తూరంగి సుగుణ గారి ఇల్లు. **ఉత్తరం:** రోడ్.

సదరు దస్తావేజు తాలూకు ఆస్తిపై ఎటువంటి బాకీలు, తనఖాలు, తగవులు లేకుండా నిష్పేచీ ఆస్తి అయి వున్నదని ఇందుమూలముగా తెలియజేయడమైనది. కావున సదరు దస్తావేజు గాని, ఫైల్ గాని దొరికినవారు మాకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

ఇట్లు: కొత్తిం చంటిబాబు
అడ్వకేట్, పెద్దాపురం, కాకినాడ జిల్లా
సెల్: 9866959809